

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



(చిక్కడపల్లి, హైదరాబాద్‌లో శ్రీనాన్నగారి ప్రవచనము, 9-8-98)

ప్రియమైన ఆత్మబంధువులారా,

కొన్ని సంవత్సరాల తరబడి సంభాషించటం వలన తెలియని విషయం మౌనం వలన ఒక్కక్షణంలో తెలుస్తుంది. మౌనం కూడా మాట్లాడుతుంది. సాధనాబలం ఉంటే, గుణసంపద ఉంటే మౌనభాష సాధకులకు అర్థమవుతుంది. మన మనస్సులో ఆందోళన ఉన్నంతకాలం, అశాంతి ఉన్నంతకాలం, రజోగుణంతో అటుఇటు ఊగిసలాడుతున్నంతకాలం మౌనసందేశం మనకు అందదు. నిజం ఎప్పుడూ సహజం గానే ఉంటుంది. సహజస్థితిలో ప్రయాశ ఉండదు, అసహజ స్థితిలో ప్రయాశ ఉంటుంది, అశాంతి ఉంటుంది. మనకు ఆందోళన ఉంటే అది నిజమైన స్థితికాదు. మనం వాస్తవమైన స్థితిలో లేము కాబట్టి అశాంతికి దుఃఖానికి గురిఅవుతున్నాము. మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. అది స్వతంత్రమైనది. దానికి భిన్నంగా ఏది చూసినా అది మనకు దుఃఖ కారణం అవుతుంది. మన హృదయంలో సత్యవస్తువు ఉన్నప్పటికి అది మనకు తెలియకపోవటానికి ఎవరో ఇతరులు కారణం కాదు, మనలో ఉన్న అజ్ఞానమే కారణం. పగలు సూర్యుడు, రాత్రి చంద్రుడు ప్రకాశాన్ని కలగజేసి మనకు వస్తువులు కనిపించేటట్లు చేస్తున్నారు. సూర్యకాంతి లేకపోతే లోకంలో వస్తువులు ఉన్నా మనకు కనబడవు. సూర్యుడు బాహ్యమైన చీకటిని పోగొడుతున్నాడు గాని మన లోపల ఉన్న అజ్ఞానమే అనే చీకటిని సూర్యుడు పోగొట్టలేడు. మనలో ఉన్న అజ్ఞానమును తొలగించటం ఒక్క గురువుకే సాధ్యం. అనుగ్రహం లేకుండా గురువు ఉండడు. గురువు చెప్పే ప్రతీ మాట కరుణాపూరితము. మనం ఈశ్వరుడిని ప్రార్థించగా, ప్రార్థించగా ఆయనే ఒక దేహం ధరించి గురువుగా వచ్చి ఆత్మవిద్యను ఉపదేశించి, మన మనస్సును అంతర్ముఖ పరచి ఆత్మకారం చెందేటట్లు చేస్తాడు. అంతర్ముఖమయిన మనస్సు నీకు లోపల ఉన్న నిజమును పట్టి ఇస్తుంది. మనస్సు బాహ్యముఖమయితే అదే ప్రపంచం అవుతుంది, అదే అహంకారం అవుతుంది, అదే గందరగోళం అవుతుంది. అదే మనస్సు అంతర్ముఖమయితే, హృదయం యొక్క లోతులలోనికి ప్రయాణిస్తే ఆత్మ అవుతుంది. ఆత్మానందం, హృదయంలో ఉన్న శాంతి నీకు దొరికినప్పడు ఇంతకు మించిన శాంతి, ఆనందం, ప్రపంచంలో లేదు అని, నీకు తెలుస్తుంది. మనస్సుతో గ్రహించేది నిజంకాదు. ఎక్కడైతే మనస్సు అణిగిందో, మనస్సుకు ఏకాగ్రత వచ్చిందో, ఇంద్రియాలు స్వాధీనంలోనికి వచ్చాయో అక్కడ ఈశ్వరుడు స్వరూపంగా వ్యక్తమవుతాడు.

మన హృదయంలో ఉన్న వస్తువు యొక్క స్వరూపం శాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం ఉండటమే. అదే మనం కాబట్టి అది ఎప్పుడూ ఉంటుంది కాబట్టి మనకు చావు అంటే

ఇష్టం లేదు. దేహానికి పరిమితమైన బుద్ధి ఉన్నవారు అంతటా ఉన్న వస్తువును పట్టుకోవటం కష్టం. అందువలన ఉపాసనకోసం దేవతల పేర్లు చెప్పారు. ఉపాసన వలన మోక్షం పొందవచ్చును. ఏక వస్తువును. చింతించుట వలన మనస్సులో ఉన్న దోషాలు, పాపాలు, దుమ్ము అంతారాలిపోతుంది. అప్పుడు మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు నిశ్చలమవుతుంది, అప్పుడు మనస్సు హృదయాకారం చెందుతుంది. నీవు పూజించే దేవుళ్ళు అందరూ నీ మనస్సుకు దృశ్యాలు మాత్రమే. నీ మనస్సు ఎంత నిజమో వారు కూడా అంతే నిజం. వైకుంఠములో దేవుడు లేడా అంటే లేడు అని ఆయన చెప్పలేదు. నేను శరీరంలోపల ఉన్నాను అని నీవు అనుకొంటున్నావు కదా అది ఎంత సత్యమో వైకుంఠములో ఉన్న దేవుడు కూడా అంతే సత్యం. ఉన్నది ఆత్మ ఒక్కటే. అయితే మనం రూపదృష్టికి అలవాటు పడ్డాము కాబట్టి దానికి దేవతాబుద్ధి కల్పించి ఆత్మను దేవతగా ఆరాధిస్తున్నాము.

ధనం ఎటువంటిదో పాండిత్యం కూడా అటువంటిదే. ఇవి ప్రకృతి విషయాలు. నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి ధనంతో గాని, పాండిత్యంతో గాని, సంబంధంలేదు, అవి అవసరం లేదు. ఇవి లేకపోయినా నీ హృదయంలో ఉన్న నిజాన్ని నీవు తెలుసుకోవచ్చును. ఏదో గురువుతో, ఒక అవతార పురుషుడితో మానసికఅనుబంధం ఉంటే చాలు. మనం భగవంతుడిని ప్రార్థించగా, ప్రార్థించగా ఆయన దర్శనం ఇచ్చి మాటలు చెప్పనక్కరలేదు, హృదయంలో నుండే గైడ్ చేస్తూ ఉంటాడు. లోపల ఉన్నదే మనకు బయట కనిపిస్తుంది నీవు పరమ పవిత్రుడవైతే, నీలో పాపాలు, లోపాలు లేకపోతే నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు ఇప్పడే ఇక్కడే నీకు ప్రత్యక్షమవుతాడు. మన లోపల అనేక దోషములు ఉన్నాయి. అందువలన ఆయన మనకు తెలియటం లేదు. దేహం ఏదో రోజు చనిపోతుంది. కాని కొంతమంది ఈ దేహమే నిత్యం అనుకొంటారు. వారు ఆత్మ విద్యను శ్రవణం చేయుటానికి అర్హులు కారు. నీలో ఉన్న బలహీనతలు తెలియజేయటానికి లోకం ఉపయోగపడుతుంది. నీలో ఉన్న బలహీనతలు తెలిసిన తరువాత వాటిలో నుండి బయటపడటానికి ప్రయత్నం చేయాలి, మహాత్ముల బోధలు శ్రవణం చేసి, మననం చేసి, ఆచరిస్తే బలహీనతలు నుండి బయట పడతావు, సత్యవస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. మన లోపల ఉన్న బలహీనతలు ఎప్పటి నుండో వస్తున్నాయి అవి చాలా బలీయంగా ఉంటాయి. మన ప్రయత్నం వలననే అందులోనుండి బయటకు రాలేము, గురువు అనుగ్రహం అవసరం.

నేను పుట్టాను కాబట్టి నాకు జ్ఞానం వస్తుంది. అనుకోకు. నీవు పుట్టావు కాబట్టి చస్తావు. నేను పుట్టాను కాబట్టి జ్ఞానం వచ్చి తీరాలి అనటానికి జ్ఞానం రావటం అనేది నీ జన్మ హక్కు కాదు. జ్ఞాన సముపార్జనకు నీవు ప్రయత్నం చేయాలి. నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆ ప్రయత్నమే అనుగ్రహంగా మారుతుంది. అనుగ్రహం యొక్క వేగం వలన నీ లోపల ఉన్న అజ్ఞానం తొలగించబడుతుంది. ఎప్పడైతే నీలోపల ఉన్న అజ్ఞానం తొలగించబడిందో అప్పడు నీలోపల ఉన్న వస్తువు తెలుస్తుంది గాని నేను పుట్టాను కాబట్టి జ్ఞానం రావాలి అంటే అది సాధ్యం కాదు.

నీ హృదయంలో ఉన్న సత్యముతో కలిసి ఉండు. దానితో మానసిక అనుబంధము పెట్టుకో. అది

నీకు సాధ్యం కానప్పుడు సత్పురుషులతోటి, జ్ఞానుల తోటి సహవాసంచెయ్యి. వారు నీతో మాట్లాడకపోవచ్చు, మౌనంగా కూడా భోదిస్తారు. భగవాన్ మౌనం గాను భోదించారు, మాటలు కూడా చెప్పారు. మౌనభోధ అర్ధం కానప్పడు మాటలు చెప్పేవారు. జ్ఞాని చూసేటప్పడు ఆ కళ్ళు చూస్తున్నాయి. అని అనుకోవద్దు అది పొరపాటు. లోపల ఉన్నచైతన్యం ఆ కళ్ళు ద్వారా చూస్తోంది అని గుర్తు పెట్టుకోండి. ఆయన మన వంక చూస్తున్నాడు అనుకోండి మనలో కూడా ఆయననే చూసుకొంటాడు గాని వీరు తెలివి తక్కువ వారు అని ఆయన చూడడు ఎందుచేతనంటే అక్కడ భేదబుద్ధి లేదు. భేదబుద్ధి ఉంటే మోహం కలుగుతుంది, మోహంఉంటే సంసారం వస్తుంది, సంసారంలో నుండి తాపత్రయం వస్తుంది. జ్ఞాని లోకాన్ని చూస్తాడు గాని బేధాన్ని గ్రహించడు.

కృష్ణుడు చెప్పిన స్థిత ప్రజ్ఞ లక్షణాలు కలిగి రామకృష్ణుడు, రమణమహర్షి వంటివారు ఈ భూమి మీద జీవించారు కాబట్టి కృష్ణుడు చెప్పినమాటలు నిజం అని మనకు అనిపిస్తుంది. అలాకొంత మంది జీవించక పోతే ఆ మాటలు అబద్ధం అని మనం అనుకొంటాము. హృదయంలో సత్యం ఉంది కాబట్టి అది వారికి అందింది. వాస్తవాన్ని వారు గుర్తించారు,కాబట్టివారు ఆనందమును పొందారు, సమాధిస్థితి కోసం భగవాన్ ప్రయత్నం చేయలేదు. మరణానుభవం తరువాత ఆస్థితి ఆయనను వచ్చి వరించింది. మరణానుభవం ద్వారా ఆయన యోగి అయ్యాడు. భగవంతుడికి భిన్నంగా, ఆత్మకంటే భిన్నంగా ఏదీ చూడకండి అప్పడు మీరు మోహంలో పడే అవకాశం రాదు అన్నారు భగవాన్. తలంపులు బాధపెడుతున్నాయి అని చెపుతారు. మహత్ముల సమక్షంలో నీలోపల ఉన్న వాసనలు అణుగుతాయి.వారి నుండి వచ్చే శాంతితరంగాలు, శక్తి తరంగాలు నీ మీద పని చేస్తాయి. ఎప్పడైతే వాసనలు అణిగిపోయాయో తలంపులు కూడా అణిగిపోతాయి. మనకు తలంపు వచ్చాక పని చేస్తాము. తలంపు వచ్చాక మాట్లాడతాము. మనం బాగుపడినా, చెడిపోయినా తలంపులే కారణం. తలంపులే .జీవితాన్ని నడిపిస్తున్నాయి. ఆ తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండటం లేదు. కనీసం మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయి, అని వాటిని watch చేయటం లేదు. తలంపుల విషయంలో నీవు తీసుకోనే జాగ్రత్త ఏమిటి ? నీవు పొందినస్థితి సరియైనదో కాదో గురువు చూస్తూ ఉంటాడు.మన గౌరవాలు, పొగడ్తలు ఆయనకు అక్కర లేదు. నిన్ను ఆత్మసింహాసనం మీద కూర్చో బెట్టటానికి గురువు ప్రయత్నం చేస్తాడు. గురువు సమక్షంలో తలంపులు అణుగుతాయి,లోపల, బయట అనే భేదబుద్ధిని తొలగిస్తాడు, అంతా నీవే అనే అనుభవం నీకు కలుగుతుంది.

జ్ఞానం అంటే చూడటం కాదు, ఉండటం. దృశ్యం అదృశ్యమవుతుంది. ఎప్పడూ ఉండే దేవుడు నిన్ను సుఖ పెడతాడా ? కనిపించి వెళ్ళి పోయే దేవుడు నిన్ను సుఖపెడతాడా ?ఆలోచించుకోండి. ఆలోచన కూడా అమృతంతో సమానము. నీవు ఎవడో నీకు తెలియనంత కాలం నేను దేవుడిని చూసాను అని చెపితే అది కేవలం మానసికదృశ్యమే కాని అది ఆత్మసాక్షాత్కారం కాదు. నీ హృదయంలో నీవు నిలకడగా ఉండగలిగితే, అక్కడ నీ మనస్సును సహజంగా ఉంచగలిగితే నీ హృదయంలో ఉన్న వస్తువు గురించి నీకు తెలుస్తుంది ఏ వస్తువు కోసం నీవు ప్రయత్నం చేస్తున్నావో దాని మీద ప్రేమ

లేక పోతే ప్రయత్నం చేసినా, ధ్యానం చేసినా నీవు దానిని పొందలేవు. ఆధ్యాత్మిక విద్యకు వినయం అవసరం. గౌరవాలు, అధికారాలు నిజం కాదు. అవిచూసి మనం మోస పోతున్నాము. వాటి మీ ఉన్న ఇష్టం సత్యం మీద మనకు లేదు. నీవు అసత్యమును సత్యం అనుకొన్నంత కాలం ఎంత ప్రయత్నం చేసినా సత్యం నీకు తెలియబడదు. అసత్యముతో నీకు ఉన్నతాదాప్యం తగ్గినప్పుడు కదా నీకు సత్యం తెలిసేది. లోపల ఉన్న సత్యం నీ మాటలకు మోసపోదు. నీవు దేనితో తాదాప్యం పొందుతున్నావో,నీ ఉద్దేశం ఏమిటో చూస్తుంది అది నీయుక్తులకు అందరు అంతర్దృష్టికి అందుతుంది. నీవు వెతుకుచున్న భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు, అన్నసంగతి తెలియ పర్చి, నీకు అంతర్దృష్టి కలుగ జేసి, అనుభవాన్ని తీసుకొని వచ్చేవాడే గురువు.

మన స్వభావం ఇతర లోకాలలో మారదు. ఇక్కడే మంచి స్వభావాన్ని అలవర్చుకోవాలి. మనం పుణ్యంచేస్తే పుణ్యలోకాలకు, పాపంచేస్తే పాప లోకాలకు వెళతాము. అనుభవిస్తే అది పోతుంది మరల ఇక్కడకు వస్తాము సాధన చేసి ఇరుకుగా ఉన్న మన స్వభావాన్ని మార్చుకొని ఇక్కడే మనం పవిత్రతను సంపాదించుకొని జ్ఞానాన్ని సంపాదించాలి. గాని ఎక్కడో ఇతర లోకాలకు వెళితే అవి భోగ లోకాలేగాని సాధనకు పనికి వచ్చే లోకాలు కాదు. శరీరం మరణించక ముందే మనం ప్రయత్నం చేసి మంచి స్వభావాన్ని అలవర్చుకొంటే మంచి స్వభావం సత్యమును తెలుసుకోవడానికి నీకు సహకరిస్తుంది. అహంకారమునకు చూడటం ఉంది, అహంకారమునకు వినటం ఉంది. కాని ఆత్మకు వినటానికి,చూడటానికి ఏమీలేదు. ఎందుచేత నంటే దానికి భిన్నంగా ఏది లేదు. అజ్ఞానం నుండి విడుదలచేసి నీవు ఎవరో నీవు తెలుసుకోవటానికి అరుణాచలేశ్వరుని స్మరించు. ఆయనను నిరంతరము స్మరిస్తూ ఉంటే ఆయన కృపకు పాత్రుడవుతావు.నీ అహంభావన ఎంత పెద్ద దుంగలా ఉన్నప్పటికి ఆయన కృప యొక్క వేగములో అది కొట్టుకొనిపోతుంది అది అరుణాచలేశ్వరుడు చేసేపని.